రిపోర్టర్లు కావలెను

తొలి సమయం

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న 'తొలి సమయం' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9000689544, 7569944360 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి : 02 సంచిక : 267 శుక్రవారం 10-10-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-


## జీవో నెంబర్ 9పై

# హైకోర్టు స్టే



### - లోకల్ ఎన్నికలు జరిగేనా.?

-బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు,
హైకోర్టులో పిటిషన్లు దాఖలు

-రెండ్రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు

-జీవో అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

-నిలిచిపోయిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 పై హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌పై వివిధ పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషనర్లు తమ వాదనలో ప్రభుత్వ జీవో ద్వారా ఎన్నికల ప్రక్రియలో అన్యాయం జరుగుతోందని కొన్ని వర్గాలకు అనుకూలంగా మార్పులు జరిగాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రాథమిక విచారణ జరిపిన హైకోర్టు, జీవో నంబర్ 9( బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన) అమలుపై స్టే విధించింది. అంతే కాకుండా, గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి విడుదలైన నోటిఫికేషన్‌పై కూడా స్టే విధించింది హైకోర్టు. కోర్టు తన ఆదేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల వ్యవధిలో సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ఆ తర్వాత ప్రభుత్వం సమర్పించిన కౌంటర్ పై అభ్యంతరాలు తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇచ్చింది. ఇక తదుపరి విచారణ ఆరు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది. దీంతో ఈ ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. హైకోర్టు తాత్కాలిక ఆదేశాల నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై అస్పష్టత నెలకొంది. ఎన్నికల కమిషన్ అధికారులు కోర్టు ఆర్డర్ కాపీ అందిన తరువాత మాత్రమే తదుపరి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. దీంతో గ్రామ, మండల స్థాయిలో నిర్వహించాల్సిన ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ తీర్పుతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. కొందరు దీన్ని ప్రజాస్వామ్య పరిరక్షణగా చూస్తుండగా మరికొందరు ప్రభుత్వ విధానాలపై కోర్టు జోక్యాన్ని తప్పు పడుతున్నారు.

**అసలు ఏం జరిగింది.?**

తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు (బీసీ) సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినదే జీవో నంబర్ 9. ఈ ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 42 శాతానికి పెంచడం జరిగింది. జీవో నంబర్ 9 ప్రధాన ఉద్దేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా పెంచడం. గతంలో 25 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ద్వారా సామాజిక న్యాయాన్ని సమకూర్చాలని ప్రభుత్వం ఉద్దేశించింది. ఈ పెంచిన రిజర్వేషన్లు ఎస్సీ (15 శాతం), ఎస్టీ (10 శాతం) రిజర్వేషన్లతో కలిపితే మొత్తం రిజర్వేషన్ల శాతం 67 శాతానికి చేరుతోంది. వివాదానికి మూల కారణం ఇక్కడే ఉంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం దేశంలో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతాన్ని మించకూడదు. జీవో 9 కారణంగా ఈ పరిమితి దాటడంతో ఇది చట్ట విరుద్ధమని పేర్కొంటూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 9 పై సుదీర్ఘంగా వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్ల అమలుపై తాత్కాలికంగా స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ స్టే కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు జరగాల్సిన నామినేషన్ల స్వీకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించడంలో సరిగా వ్యవహరించలేదనే

మిగతా 2లో




## దాడిపై సీజేఐ తొలి స్పందన

◆ రెండు రోజుల తర్వాత స్పందించిన జస్టిస్ గవాయ్

◆ ముగిసిపోయిన అధ్యాయంగా అభివర్ణించిన సీజేఐ

న్యూఢిల్లీ మధ్యప్రదేశ్ లోని ఖజురహోలో విష్ణుమూర్తి విగ్రహంపై కేసు విచారణ సందర్భంగా తాను అనని మాటల్ని సాకుగా చూపుతూ తనపై షూ విసిరిన లాయర్ వ్యవహారంపై సీజేఐ బీఆర్ గవాయ్ గురువారం తొలిసారి నోరువిప్పారు. తాజాగా సుప్రీంకోర్టులో తనపై లాయర్ రాకేష్ కిషోర్ దాడి చేయగానే స్పందించిన ఆయన, దీన్నో చిన్న విషయంగా తీసుకుని వాదనలు కొనసాగించాలని అక్కడే ఇతర లాయర్లకు సూచించారు. ఆ తర్వాత బార్ కౌన్సిల్ సదరు లాయర్ ను సస్పెండ్ చేసింది. గురువారం ఆ ఘటనపై తొలిసారి బహిరంగంగా మాట్లాడిన ఛీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అదో మర్చిపోవాల్సిన అధ్యాయమని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టులో మరో జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కూడా స్పందించారు. ఈ ఘటనపై తనకు స్వంత అభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఆయన ఓ సీజే అని, ఇది జోక్ కాదన్నారు. ఈ ఘటన జరగగానే సీజేఐ స్పందిస్తూ ఇవన్నీ చూసి డిస్టర్బ్ కావొద్దని, తామూ డిస్టర్బ్ కాబోమని లాయర్లకు తెలిపారు. ఈ ఘటన తర్వాత ఢిల్లీ పోలీసులు సీజేఐపై షూ విసిరిన లాయర్ రాకేష్ కిషోర్ ను అదుపులోకి తీసుకున్నారు. మూడు గంటల పాటు ఆయన్ను విచారించారు. అయితే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆయనపై కేసు నమోదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పోలీసులు లాయర్ ను వదిలిపెట్టారు. ఆ తర్వాత బయటికి వచ్చిన

మిగతా 2లో



## రైతుకు లాభం, వినియోగదారుడికి మేలు

● వ్యవసాయ, అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి "రైతు పండించిన పంటకు సరైన ధర దక్కాలి, అదే సమయంలో ఆ పంటను కొనుగోలు చేసే వినియోగదారుడిపై అధిక భారం పడకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేయడమే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ఈ దిశగా కలిసి పనిచేసి, రైతులు, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి అచ్చెన్నాయుడు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు.


**మార్కెట్ యార్డుల ఆధునీకీకరణకు మాస్టర్ ప్లాన్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 218 వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డుల పరిధిలోని ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "మార్కెట్ యార్డుల్లో కోల్డ్ చైన్ వ్యవస్థలు, అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి ఏర్పాటు చేయాలి. దీనివల్ల పంట నిల్వ సామర్థ్యం పెరిగి, రైతులకు మెరుగైన ధర లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. రైతు బజార్లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని, పట్టణ ప్రాంతాల్లో

మిగతా 2లో

## ఆర్టీసీ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ పోరుబాట

ప్రభుత్వానికి కేటీఆర్, హరీష్ అల్టిమేటం



2

## పార్టీ పరమైన రిజర్వేషన్లా.? న్యాయపోరాటం కొనసాగింపా.?




2

-స్థానిక ఎన్నికలపై రేవంత్ ప్లానేంటి.?

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి


-బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్



2

## హైకోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తాం

-ఉత్తర్వులపై స్పందించిన ఎలక్షన్ కమిషన్






## స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని మరొకటి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో ఈరోజు ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "నాకు ఎలాంటి గ్రూపులూ లేవు, బీజేపీయే నా గ్రూప్. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ

మిగతా 2లో

## వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తా

ఉప్పాడవాసులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ



2

దిన పత్రిక తొలి సమయం



# జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే

వాదనలను పరిగణనలోకి తీసుకుంది హైకోర్టు. ఈ అంశంపై పూర్తి వివరణ, వాస్తవాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను నాలుగు వారాలలోపు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ కూడా రెండు వారాలకు వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తూ సమగ్ర కులగణన ద్వారా లభించిన డేటా ఆధారంగానే రిజర్వేషన్లు పెంచామని ఇది ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం అని సమర్థించుకున్నారు. అయితే ఇప్పుడు ఈ రిజర్వేషన్ల భవితవ్యం, తద్వారా స్థానిక ఎన్నికల నిర్వహణ పూర్తిగా న్యాయపరమైన అంశాల పరిష్కారం పైనే ఆధారపడి ఉంది.

# దాడిపై సీజేఐ తొలి స్పందన

అతను, తనతో దేవుడే ఈ దాడి చేయించాడన్నారు. సనాతన ధర్మ వ్యతిరేకులపై దేవుడి ఆదేశాల మేరకే తాను దాడి చేసినట్లు చెప్పుకొచ్చాడు. మరోవైపు సీజేఐ గవాయ్ పై జరిగిన దాడిపై దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు స్పందించాయి. ప్రధాని మోడీ సహా కీలక నేతలంతా ఈ దాడిని ఖండించారు. ప్రధాని మోడీ ఆ తర్వాత సీజేఐతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. అయితే సీజే మాత్రం ఈ విషయాన్ని పెద్దది చేయకూడదని భావిస్తుండటంతో సదరు లాయర్ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

# రైతుకు లాభం, వినియోగదారుడికి మేలు లక్ష్యం

అవసరమైన భూమిని అంచనా వేయాలని చెప్పారు. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని తెలిపారు. నిధుల సమీకరణ కోసం మార్కెట్ కమిటీలు, రైతు బజార్లను కలిపి ఒక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల పత్తికొండలో టమాటో ధరలు పడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి పరిస్థితుల్లో పంటను నేరుగా రైతు బజార్లకు తరలించి ప్రజలకు అందుబాటు ధరలకు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు.

**రసాయనాలకు చెక్.. సేంద్రియ సాగుకు జై**

రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహతో రైతులు భూసారాన్ని దెబ్బతీస్తున్నారు. ఈ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం కూడా పాడవుతోంది. ఈ విధానానికి స్వస్తి పలకాలి" అని అన్నారు. 2026 ఖరీఫ్ నాటికి సేంద్రియ సాగును గణనీయంగా పెంచేలా, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. భూసారాన్ని పెంచే పోషకాలపై దృష్టి సారించి, ప్రకృతి సేద్యం వల్ల కలిగే ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలను రైతులకు వివరించాలని చెప్పారు. రైతులకు అన్ని రకాల సేవలు అందించేలా రైతు సేవా కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలని తెలిపారు.

**రబీకి పక్కా ప్రణాళిక.. ఎరువుల పంపిణీపై కఠిన వైఖరి**

రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని సీఎం స్పష్టం చేశారు. అధికారులు రబీకి 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ, "భూసార పరీక్షల నివేదికల ఆధారంగా రైతులకు ఎంత ఎరువు అవసరమో నిర్దేశించాలి. సాగు విస్తీర్ణాన్ని బట్టి సరఫరా జరగాలి. ఆధార్ ఆధారితంగానే యూరియా పంపిణీ చేసి, అక్రమ రవాణాను అరికట్టాలి. ప్రతి రైతు, కౌలు రైతుకు ఎంత యూరియా ఇచ్చారనే దానిపై పక్కా రికార్డులు నిర్వహించాలి" అని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ధాన్యం సేకరణ లక్ష్యం గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికంగా 51 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్దేశించినట్లు అధికారులు తెలపగా, రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలు.. అనుబంధ రంగాలపై దృష్టి**

ఈ సమీక్షలో, ప్రధాని ప్రారంభించనున్న 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'పై కూడా చర్చించారు. ఈ పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. సెరీకల్చర్ (పట్టు పరిశ్రమ) రంగంలో కర్ణాటకతో పోలిస్తే ఏపీ వెనుకబడి ఉండటంపై విశ్లేషణ చేయాలన్నారు. పట్టు ఉత్పత్తి యంత్రాలను ఎంఎస్ఎంఈల ద్వారా సబ్సిడీపై అందించాలని, ఈ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం కూడా తీసుకోవాలని చెప్పారు. ఉల్లి, టమాటో, మిర్చి వంటి పంటల విషయంలో ధరలు పడిపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీలుగు బెల్లం, వెదురు ఉత్పత్తులను అరకు కాఫీ తరహాలో ప్రోత్సహించాలని, పుట్టగొడుగుల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటల మద్దతు ధరల పోస్టర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

# పార్టీ పరమైన రిజర్వేషన్లా.? న్యాయపోరాటం కొనసాగింపా.?

తెలంగాణ రాజకీయాలు బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవో ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇచ్చారు. నోటిఫికేషన్ కూడా గురువారం వచ్చింది. కానీ కోర్టు ఇచ్చిన స్టే కారణంగా రిజర్వేషన్లు చెల్లవు కాబట్టి ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. కోర్టు ఆదేశాలను గౌరవిస్తామని ఎస్ఈసీ ప్రకటన చేసింది. ఇప్పుడు రేవంత్ ముందు స్థానిక ఎన్నికల నిర్వహణ విషయంలో రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి న్యాయపోరాటం కొనసాగించడం రెండు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలను నిర్వహించేయడం.

**ఎన్నికలు జరపాలనుకుంటే పార్టీ పరమైన రిజరవేషన్లతో నిర్వహణ**

స్థానిక ఎన్నిక ఎన్నికలను రేవంత్ నిర్వహించాలనుకుంటున్నారా, వద్దనుకుంటున్నారా అన్నదానిపైనే తదుపరి ప్రభుత్వ వ్యూహం ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు. స్థానిక ఎన్నికలను నిర్వహించాలనుకుంటే గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ల జీవో ఆధారంగానే షెడ్యూల్ మార్చి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలా చేస్తే రాజకీయపరమైన విమర్శలు, బీసీలను మోసం చేశారన్న ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే దీనికి పరిష్కారంగా న్యాయపరమైన వివాదాలు ఉన్నాయి కాబట్టి పార్టీ పరమైన రిజర్వేషన్లు ఇస్తున్నామని బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఇతర పార్టీలు అదే విధంగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. అలా చేయడం వల్ల ఎదురుదాడి చేయవచ్చు.

**ఎన్నికలు వద్దనుకుంటే న్యాయపోరాటం**

ఒక వేళ స్థానిక ఎన్నికలు ఇప్పుడు అవసరం లేదని, అదో తలనొప్పని రేవంత్ రెడ్డి అనుకుంటే న్యాయపోరాటానికి మొగ్గు చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం హైకోర్టు లో విచారణ జరగాలంటే నాలుగువారాలు పడుతుంది. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని ప్రకటించారు. అలా వెళ్తే అక్కడ రిలీఫ్ వస్తుందని అనుకోవడానికి లేదు. ఎందుకంటే రిజర్వేషన్ల జీవోలో అన్ని సంక్లిష్టతలు ఉన్నాయి. న్యాయపోరాటం ఎంత కాలం సాగుతుందో చెప్పలేరు. అంత కాలం ఎన్నికలు నిర్వహించకుండా ఉండలేరు.

**ఎన్నికలు పెట్టకపోతే బ్యాక్ లాగ్‌లా ఉండిపోతాయి**

స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే బ్యాక్ లాగ్‌లా ఎప్పటికీ అలా ఉండిపోతాయి. ఎందుకంటే లోకల్ పోల్స్ కోసం గ్రామస్థాయి క్యాడర్ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గత పన్నెండేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కు రాజకీయ పరమైన పదవులు లేవు. గ్రామాల్లో, మండలాల్లో అధికారం లేదు. ఇప్పుడు ఆ అదికారాన్ని కోరుకుంటున్నారు.

ఎలాగైనా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాలన్నా ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి. ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతే భారంగా మారతాయి కానీ ప్లస్ అయ్యే అవకాశాలు ఉండవు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి కూడా వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తారని దానికి ప్లాన్ బీ అమలు చేస్తారని గట్టిగా నమ్ముతున్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్నది రెండు, మూడు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ఉప్పాడ ప్రాంత మత్స్యకారులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించారు. సముద్ర కాలుష్యం, తీర కోత, మత్స్యకారుల ఇబ్బందులు వంటి కీలక సమస్యలపై విస్తృత చర్చ జరిగింది. వేటకు వెళ్లి మృతి చెందిన 18 మత్స్యకారుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. పారిశ్రామిక వ్యర్థాల వల్ల సముద్రకాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఆడిట్ చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. 100 రోజుల్లో సమస్యల పరిష్కారానికి మత్స్యకారులతో కలిసి నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకారుల ప్రతినిధులు సముద్రంలో కలిసే పారిశ్రామిక వ్యర్థాల వల్ల చేపలు మరణిస్తున్నాయని, తమ జీవనోపాధి ప్రభావితమవుతోందని తెలిపారు. తీర కోత, మత్స్య సంబంధిత సహాయాలు, బీమా వ్యవస్థలలో లోపాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పవన్ కళ్యాణ్ మత్స్యకారుల ప్రతి సమస్యను శ్రద్ధగా విని, అధికారులతో నోట్ చేయించారు. "మీ సమస్యలు మా ప్రాధాన్యత. పరిశ్రమలు, మత్స్య శాఖ, పీసీబీ, ఎన్జీవోలు, మత్స్యకారులు అందరినీ భాగస్వాములను చేసి, 100 రోజుల్లో పరిష్కార మార్గాలు సూచిస్తాం" అని భరోసా ఇచ్చారు. పీసీబీ అధికారులు పారిశ్రామిక కాలుష్యంపై వెంటనే ఆడిట్ చేపట్టి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వేటకు వెళ్లి మరణించిన 18 మంది కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 90 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. ఉప్పాడ తీరప్రాంతంలో పారిశ్రామిక ప్రదేశాల వల్ల సముద్ర నీటి కలుష్యం పెరిగింది. చేపలు మరణించడం, మత్స్యకారుల ఆదాయం తగ్గడం వంటి సమస్యలు గత కొన్ని నెలలుగా కొనసాగుతున్నాయి.ప్రభుత్వం ఇప్పటికే ఈ సమస్యలపై కమిటీ ఏర్పాటు చేసింది. పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా కాకినాడకు చేరుకుని, భారీ బందోబస్తు మధ్య సమావేశం జరిగింది. కలెక్టరేట్ సమావేశం ముగిసిన తర్వాత, మత్స్యకారులు, స్థానిక నాయకులతో మరిన్ని చర్చలు జరిగాయి.

# ఆర్టీసీ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ పోరుబాట

తెలంగాణలో ఆర్టీసీ ఛార్జీల పెంపును బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పేరుతో కుటుంబంపై పెను భారం మోపుతున్నారని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని నేతలు ఆరోపించారు. ఛార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు బస్ భవన్ ముట్టడికి యత్నించారు. అయితే కీలక నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయినప్పటికీ కేటీఆర్, హరీష్, సహా కొద్ది మంది నేతలు ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించి బస్‌భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ మార్గం నుంచి , మాజీ మంత్రి హరీష్‌రావు మెహదీపట్నం నుంచి , పద్మారావుగౌడ్ ఇంకో పక్క నుంచి బస్‌లు ఎక్కి బస్ భవన్‌కు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి టికెట్ తీసుకున్న నేతలు ప్రభుత్వం తీసుకున్న ఛార్జీల పెంపు నిర్ణయంతో ఒక్కో కుటుంబంపై నెలకు వెయ్యి రూపాయల వరకు భారం పడుతుందని అన్నారు. మహిళలకు ఉచితం అంటూనే మిగతా వారి నుంచి భారీగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఇది సరికాదని ఆర్టీసీ నష్టాల్లో ఉంటే కచ్చితంగా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. దీనికి ప్రజలపై భారం వేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు.వివిధ ప్రాంతాల నుంచి బస్ భవన వద్దకు బీఆర్ఎస్ నేతలు చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆర్టీసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు నేతలు యత్నించారు. అప్పటికే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని నియంత్రించారు. నేతలతో అధికారులు చర్చించి కేవం నలుగురిని మాత్రమే ఎండీతో సమావేశమయ్యేందుకు అంగీకరించారు. దీనికి బీఆర్ఎస్‌నేతలు కూడా ఓకే చెప్పారు. పోలీసుల సూచన మేరకు కేటీఆర్, హరీష్‌రావు, పద్మారావు గౌడ్ ఎండీని కలిశారు. ఆర్టీసీ ఛార్జీల పెంపు, ప్రైవేటీకరణ ఆరోపణలు, ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇతర సమస్యలపై చర్చించారు. బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లారు. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీని కోసం ఎంత దూరమైన వెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే ఐదారుసార్లు బస్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. ఓవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలపై భారాన్ని మోపుతున్నారని అన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ స్థలాలను అమ్మకానికి పెడుతున్నారని మండిపడ్డారు. కొన్నింటిని తాకట్టు పెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. అన్ని విధాలుగా ఆర్టీసి పూర్తిగా నాశనం చేసి ప్రైవేటుపరం చేయాలని ప్లాన్ చేస్తున్నారని అన్నారు.

ఆర్టీసీ ఆస్తులు తాకట్టు పెడుతున్న ప్రభుత్వం కార్మికులకి కూడా మంచి చేయడం లేదన్నారు బీఆర్ఎస్ నేతలు. వారికి రావాల్సిన బకాయిలను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలు కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. అటు ప్రజలు, ఇటు కార్మికులను కలుపుకొని వెళ్లి ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

# భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా కీలక వ్యాఖ్యలు

ప్రపంచ ఆర్థిక సమీకరణాలు మారుతున్న ప్రస్తుత తరుణంలో, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వృద్ధికి కీలక ఇంజిన్‌గా మారిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం స్థిరంగా దూసుకెళుతోందని ఆమె పేర్కొన్నారు.వచ్చే వారం వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జార్జియేవా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచవ్యాప్తంగా వృద్ధి సరళిలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా చైనా వృద్ధి క్రమంగా మందగిస్తుండగా, భారత్ ఒక కీలక వృద్ధి చోదక శక్తిగా అభివృద్ధి చెందుతోంది" అని ఆమె వివరించారు. కరోనాకు ముందు ప్రపంచ వృద్ధి రేటు 3.7 శాతంగా ఉండగా, ప్రస్తుతం మధ్యకాలికంగా అది 3 శాతం వద్దే కొనసాగుతుందని అంచనా వేశారు.అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు అనేక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడ్డాయని చెబుతూనే, ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షలు ఎదురుకాలేదని, కాబట్టి ఇప్పుడే ఊపిరి పీల్చుకోవడం తొందరపాటు అవుతుందని ఆమె హెచ్చరించారు.ఐఎంఎఫ్ మాత్రమే కాకుండా ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలు కూడా భారత్‌పై సానుకూల దృక్పథంతో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, 2026 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. ఇదే బాటలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి సవరించింది.గత వారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, జీఎస్టీ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు, బలమైన ప్రైవేట్ వినియోగం, స్థిర పెట్టుబడుల కారణంగానే ఈ వృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. 2025-26 మొదటి త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం మేర బలమైన వృద్ధిని నమోదు చేసిందని ఆయన గుర్తు చేశారు. మంచి వర్షపాతంతో గ్రామీణ డిమాండ్ బలంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో కూడా డిమాండ్ క్రమంగా పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్

కష్టపడి పనిచేయాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు తమ సొంత గ్రామాల్లో, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే వారికి గౌరవం, పలుకుబడి ఉంటాయని తేల్చిచెప్పారు.

అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుతూ, "గెలుపు అవకాశాలే ప్రామాణికంగా సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను ప్రకటిస్తుంది. ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రమే అంతిమం కాదు" అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, టిక్కెట్లు ఆశించే వారు నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వమే నిధులు అందిస్తోందని బండి సంజయ్ అన్నారు. "దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులిచ్చిన ఏకైక ఎంపీని నేనే. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు నయా పైసా ఇవ్వడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్ర నిధులను దారి మళ్లించి పల్లెలను నాశనం చేసింది" అని ఆయన ఆరోపించారు. అటువంటప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలకు ఏం ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటు అభ్యర్థించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గురువారం స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో సమావేశమైన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భద్రతా మండలిలో భారత్ తన హక్కుగా పొందాల్సిన స్థానాన్ని దక్కించుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం" అని ఆయన అన్నారు. భారత్ శాశ్వత సభ్యత్వానికి ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు మద్దతు తెలుపగా, ఇప్పుడు యూకే కూడా అదే బాటలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తన భారత పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, గత దశాబ్ద కాలంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందంతో తాను ఇక్కడికి వచ్చినట్లు స్టార్మర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్, యూకేలు ప్రపంచ నాయకులుగా కలిసి నిలుస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరిందని కూడా ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో, గాజాలో శాంతి ఒప్పందం మొదటి దశకు చేరుకోవడం పట్ల స్టార్మర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎంతో ఉపశమనం కలిగించే క్షణమని, ఈ శాంతి ప్రణాళిక పూర్తిస్థాయిలో అమలు కావడానికి యూకే మద్దతుగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## హైకోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తాం

## ఉత్తర్వులపై స్పందించిన ఎలక్షన్ కమిషన్

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) దీనిపై అధికారికంగా స్పందించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్ 9 అమలుపై, ఈ రోజు విడుదలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తాము పాటిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి గురువారం ప్రెస్ నోట్ విడుదల చేశారు.

**ఎన్నికల సంఘం నిర్ణయం..**

తెలంగాణ హైకోర్టు నుంచి ఆర్డర్ కాపీ అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. హైకోర్టు ఈ అంశంపై తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. దీంతో ఆ గడువు ముగిసే వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండబోదని. సడలింపు లభించినట్టేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో లేకపోవడం వల్ల ప్రభుత్వ కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఉన్న నియంత్రణలు తాత్కాలికంగా తొలగిపోతాయి. ఈ వాయిదా కాలంలో రాజకీయ పార్టీలు కూడా తమ ప్రచార వ్యూహాలను తిరిగి సమీక్షించుకోవడానికి, అభ్యర్థుల ఎంపిక విషయంలో పునరాలోచన చేయడానికి అవకాశం లభించింది.

**ఆశావహుల్లో తీవ్ర నిరాశ..**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలని ఆశించిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ఈ తీర్పుతో తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. గురువారం ఉదయం మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా నామినేషన్లు దాఖలు చేయడానికి అంతా సిద్ధమై ఉన్న ఆశావహులు ఈ కోర్టు స్టే తో షాక్‌కు గురయ్యారు. జిల్లాలలోని ఆయా పార్టీ కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ సందడి కారణంగా నాయకులు మద్దతుదారులతో కోలాహలం నెలకొంది. అయితే హైకోర్టు తీర్పు వెలువడగానే ఆ సందడి ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది. అభ్యర్థిత్వం ఖరారైన తమ పార్టీ నాయకులతో మాట్లాడి నామినేషన్ పత్రాలు సమర్పించాలని ఆసక్తిగా ఎదురుచూసిన వారంతా ఈ పరిణామంతో తమ తమ నివాసాలకు వెనుదిరగాల్సి వచ్చింది. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తదుపరి ఎలాంటి న్యాయ పోరాటం చేస్తుందోననే ఉత్కంఠ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో నెలకొంది.

## ఆ విమానం కూలిపోవడడానికి కారణం మేమే: పుతిన్

గతేడాది అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కూలిపోయిన ఘటనలో తమ వైమానిక దళం పాత్ర ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్ తొలిసారి బహిరంగంగా అంగీకరించారు. ఈ దుర్ఘటనలో 38 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌తో బాకూలో జరిగిన సమావేశంలో పుతిన్ ఈ కీలక ప్రకటన చేశారు. ఏడాది కాలంగా ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన ఈ ఘటనపై పుతిన్ తాజా అంగీకారం ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 డిసెంబర్ 25న అజర్‌బైజాన్ రాజధాని బాకూ నుంచి 67 మంది ప్రయాణికులతో చెచెన్యాలోని గ్రోజ్నీ నగరానికి బయలుదేరిన అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం రష్యా గగనతలంలో ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో రష్యా వైమానిక దళం ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్‌లను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించింది. ఆ క్షిపణులు పౌర విమానానికి అత్యంత సమీపంలో పేలిపోవడంతో, వాటి శకలాలు విమానాన్ని బలంగా తాకాయి. దీంతో విమానం తీవ్రంగా దెబ్బతింది. పైలట్లు అత్యవసరంగా కజకిస్థాన్‌లో ల్యాండ్ చేయడానికి ప్రయత్నించినా విఫలమై విమానం కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో 38 మం అక్కడికక్కడే మరణించగా, మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు.

అధ్యక్షుడు అలియెవ్‌తో భేటీ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ, "ఆ విమాన ప్రమాదంలో మా వైమానిక దళం ప్రమేయం ఉన్న మాట వాస్తవమే. ఇది చాలా బాధాకరమైన సంఘటన" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం ఫోన్ సంభాషణ జరిగింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన చారిత్రక గాజా శాంతి ప్రణాళిక విజయవంతం కావడం పట్ల ట్రంప్‌కు ప్రధాని మోదీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అదే సమయంలో, ఇరు దేశాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య చర్చల్లో సాధించిన పురోగతిని కూడా ఇరువురు నేతలు సమీక్షించుకున్నారు.ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడాను. చారిత్రక గాజా శాంతి ప్రణాళిక విజయవంతమైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపాను. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో సాధించిన మంచి పురోగతిని కూడా సమీక్షించాం. రాబోయే వారాల్లోనూ టచ్‌లో ఉండాలని అంగీకరించాం" అని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు.నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఫోన్ సంభాషణ జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. సెప్టెంబర్ 16న ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా ట్రంప్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా ఉక్రెయిన్ శాంతి చర్చల విషయంలో ట్రంప్ చొరవకు మోదీ మద్దతు ప్రకటించారు. దీనికి ట్రంప్ కూడా ధన్యవాదాలు తెలిపారు.

దిన పత్రిక
తొలి సమయం
శుక్రవారం 10 అక్టోబర్2025

## పేద విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత




తొలి సమయం దంతాలపల్లి అక్టోబర్ 9: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ అకాడమీ డైరెక్టర్ డి హబ్ ప్రాజెక్ట్ మేనేజర్ చిర్ర సతీష్ ఆధ్వర్యంలో స్ఫూర్తి ఫౌండేషన్ వారి సహకారంతో వరంగల్ సెయింట్ పీటర్స్ కళాశాలకు చెందిన బి ఫార్మసీ 3వ ఏడాది చదువుతున్న నిరుపేద విద్యార్థిని అయిన నల్ల శ్రావణికి రూ,40,000 ఆర్థిక సహాయం అందచేశారు.వరంగల్ సెయింట్ పీటర్స్ బి ఫార్మసీ 3వ ఏడాది చదువుతున్న నల్ల శ్రావణి కళాశాల ఫీజు చెల్లించకపోవడంతో చాలా ఇబ్బంది పడుతుండడంతో చిర్ర సతీష్ ఈ విషయం తెలుసుకొని స్ఫూర్తి ఫౌండేషన్ వారిని సంప్రదించగా స్ఫూర్తి ఫౌండేషన్ వారు వెంటనే స్పందించి అక్షరాల రూ,40,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా చిర్ర సతీష్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కంటే సహాయం చేసే చేతులే గొప్పవి మానవ సేవయే మాధవ సేవ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చిన్నదో పెద్దదో చేతనైనంత సహాయం చేయదానికి అందరూ ముందుకు రావాలని ప్రతి ఒక్కరూ సమాజ సేవను అలవర్చుకోవాలని ఆయన తెలిపారు.ఆపద కాలంలో స్పందించి నిరుపేద విద్యార్థినికి కళాశాల ఫీజు కోసం ఆర్థిక సహాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి చిర్ర సతీష్,ఓంకార్ ,చిత్తలూరి హుస్సేన్ ,నల్ల పద్మ పాల్గొన్నారు

## డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి.

### ఫీజులు తగ్గించకపోతే ఆందోళన చేపడుతాం

### పి డి ఎస్ యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ.




తొలి సమయం, భద్రాద్రి కొత్తగూడెంఅక్టోబర్, 09.కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని పి డి యస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్,ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో డిగ్రీ కోర్సులు 2025-26 ప్రవేశాలు పొందిన ఫస్ట్ ఇయర్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచి పేద విద్యార్థులపై భారాన్ని మోపింది అని అన్నారు. ఒక్కో విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో 80 ఉండగా ఇప్పుడు 1200 రూపాయలకు పెంచారు. రికగ్నేషన్ ఫీజు గతంలో 400 ఉండగా ఇప్పుడు 800 కు ఐ యు డి ఎఫ్ ఫీజు గతంలో 60 ఉండగా ఇప్పుడు 300 కు ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఫీజు గతంలో 50 ఉండగా ఇప్పుడు 200 కు పెంపుదల చేసి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారు. ఒక్క పరీక్ష ఫీజు మాత్రమే 750 గతంలో మాదిరిగానే యధావిదంగా కొనసాగిస్తున్నారు.గతంలో ఒక్కొక్క విద్యార్థి ఆయా అన్ని రకాల ఫీజుల కింద 1340 చెల్లించేవారు.ఇప్పుడు ఏకంగా ఆ ఫీజులు అన్ని కలిపి 3,250 కి పెంపుదల చేశారు.గతం కంటే ఒకేసారి ఒక్కో విద్యార్థిపై 1910 రూపాయలు ఫీజు భారం పడుతుంది. ఒకేసారి ఇంత భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, పేద విద్యార్థులు ఏమాత్రం కట్టలేనటువంటి ఫీజుల భారాన్ని విద్యార్థులపై ప్రభుత్వం మోపడం సరికాదని తక్షణమే ప్రభుత్వం పున:ర ఆలోచించి ఫీజుల భారం తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతాం




తొలి సమయం, ఇల్లందు అక్టోబర్, 09.స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే సారయ్య అన్నారు. గురువారం ఇల్లందు మండల సిపిఐ విస్తృతస్థాయి సమావేశం పట్టణంలోని విట్టల్ రావు భవన్ నందు జరిగింది. ఈ సందర్భంగా కే సారయ్య మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా కమిటీ ఎన్నికల ఒడంబడిక ఆధారంగానే 16 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జడ్పిటిసి స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు . స్థానిక సమస్యలపై పోరాటం చేసి, ప్రజల్లో అభిమానం చూరగొన్న కార్యకర్తలకే పార్టీ బీఫామ్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క కార్యకర్త సిపిఐ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, సిపిఐ నాయకులు బసిపాక రవి,మోజెస్, గుగులోత్ కృష్ణ, ఉడుత ఐలయ్య, వడ్ల శీను, మంచాల వెంకటేశ్వర్లు, రాము, అలెం రాఘవేంద్రరావు, తాండ్ర లక్ష్మీనారాయణ, బొల్లి కొమరయ్య, సదానందం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### రాయిశెట్టి ఉపేందర్ మాదిగ జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత



తొలి సమయం తొర్రూరు అక్టోబర్ 9సుప్రీం చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ అంబెద్కర్ అవార్డు గ్రహీత రాయిశెట్టి ఉపేందర్ మాదిగ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గవాయి పై జరిగిన దాడి ఈ దేశ ప్రజాస్వామ్యంపై భారత రాజ్యాంగం పై జరిగిన దాడిగానే భావిస్తామని దీనికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ ఆక్ట్ నమోదు చేసి జైల్లో శిక్షించాలని మత విద్వేషాలు రెచ్చగొట్టేలా దేశంలో అల్లర్లు సృష్టించే విధంగా చేస్తున్నటువంటి ఆర్ఎస్ఎస్ మత ఛాందసవాదులకు తగిన గుణపాఠం చెప్పే వరకు వదిలేది లేదన్నారు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవాన్ దాస్ జరిగిన దాడి పై స్పందించాలని లేకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు

# బీ.సీ లపై జరుగుతున్న కుట్రయే ఈ ఎన్నికల డ్రామా..

## అఖిలపక్ష ఐక్యవేదిక ఆరోపణ.



తొలి సమయం, వనపర్తి, అక్టోబర్ 09 తూతూ మంత్రంగా రిజర్వేషన్ ప్రక్రియ చేయడంతో, హై కోర్టులో ఎలక్షన్ ప్రక్రియ నిలిచిపోవడమే దీనికి సాక్ష్యం. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డా" సతీష్ యాదవ్ మాట్లాడుతూ, మొదటినుండి బీసీ రిజర్వేషన్ తంతు సరిగా జరగలేదని, పూర్తిస్థాయిలో బీసీ కులగనన ప్రక్రియ జరగలేదని, బీసీలపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదని, ఎందుకంటే అన్ని పార్టీలను పాలిస్తున్నది అగ్రవర్ణాల నాయకులనీ, వారు ఎలా చేయాగలరని ప్రశ్నించారు. ఈరోజు జరుగుతున్నది చూస్తుంటే మొదటి నుండి మనల్ని పాలించేది వారే, రిజర్వేషన్లు బిల్లు పెట్టేది వాళ్లే, ఆదర బాదరగా ఎలక్షన్ పెట్టేది వారే నని, కోర్టుకు వెళ్ళేది వారేనని, కోర్టులలో వాదించేది వారేనని, జడ్జిమెంట్ ఇచ్చేది వారేననీ , కనుక బి సీ లపై వారికెలా ప్రేమ ఉంటుందని, ఒకవేళ బీసీ నాయకుల చేతికి ఈ రిజర్వేషన్ తంతు అప్పగించి ఉండి ఉంటే సరైన దిశగా మాకు రిజర్వేషన్లు కల్పించడం జరుగుతుండేదని, ఆగ్రహం వెళ్లి బుచ్చారు. రానున్న కాలంలో చట్టసభల్లో కూడా మాకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే ఉద్యమాలు చేపడతామని, మరో నేపాల్ ఉద్యమం లా కాకుండా చూడాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్ తో పాటు వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రామస్వామి, నాగరాజు, రమేష్, జింగిడిపురం రవి

# కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ఎన్నికల సమరం సాగించాలి.





తొలి సమయం, వనపర్తి, అక్టోబర్ 09
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార ధోరణితో బి.సి.లకు తీవ్ర నష్టం.హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం.మన బాకీ కార్డు ప్రజల బ్రహ్మాస్త్రం కావాలి.పార్టీ పట్ల విధేయత, ప్రతిష్ఠ పెంచే నాయకులు మన దగ్గర ఉండడం బలం. సింగిరెడ్డి .నిరంజన్ రెడ్డి.మాజీ మంత్రివర్యులు .ఘనపూర్ మండల ఎన్నికల సన్నాహక సమావేశం ఈరోజు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు రాళ్ళ.కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది.ఇట్టి సమావేశములో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మన పార్టీకి ఉన్న సమర్థవంతమైన నాయకులు సుశిక్షితులైన కార్యకర్తలు ఇతర సాంప్రదాయ పార్టీలకు లేరని ఇది మనకు బలమని అన్నారు.కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ఎన్నికల సమరం సాగించాలి అని ప్రతినిత్యం ప్రభుత్వ వైఫల్యం ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. బాకీ కార్డుల పంపిణీకి ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తుందని ప్రతి ఇంటికి వెళ్లి బాకీ కార్డు ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీలలో బకాయి పడ్డ రూపాయలను ప్రజలకు వివరించాలని అన్నారు. రేవంత్ రెడ్డి అభివృద్ధి చేయకుండా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ది ప్రైవేట్ వ్యవస్థత నడుపుతున్నారని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అన్నారు. 22నెలల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకారం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 55000, వృద్ధులకు వికలాంగులకు ఫించన్ల ద్వారా 44000,రైతులకు ఒక్క ఎకరానికి 76000,కళ్యాణ లక్ష్మీ ద్వారా తులం బంగారం,నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు బకాయి పడ్డారు అని ఇట్టి విషయాన్ని బాకీ కార్డుల ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని పిలుపునిచ్చారు.కె.సి.ఆర్ కిట్టు,కంటివెలుగు,బతుకమ్మ చీరలు,రంజాన్ తోఫా వంటి పథకాలకు మంగళం పలికారని అన్నారు. ఘనపూర్ మండల బి.ఆర్.ఎస్ పార్టీ కంచుకోట అని రాబోవు ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ జెడ్.పి.టి.సి సామ్యా నాయక్, రంగారెడ్డి,బాలేశ్వర్ రెడ్డి,జాత్రు నాయక్,వెంకట్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీలో పలువరి చేరిక,ఘనపూర్ మండల తిరుమలయపల్లి నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.వెంకట్ రెడ్డి ఆధ్వర్యములో నారాయణ, బుడ్డయ్య,కృష్ణయ్య,దాసు,నర్సింలు,తిరుమలేశ్, పెబ్బేరు మండలం సుగర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్.టి. సి ఉద్యోగి మాల.ఆంజనేయులు,మాజీ ఉపసర్పంచ్ మొగిలమ్మ, శ్రీనివాసులు, బెక్కెం. రఘు, హనుమన్న,జయరాం, దశరథం,భాస్కర్, పులేందర్, బాలరాజు గౌడ్ తదితరులు గౌరవ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరినారు.ఈ కార్యక్రమములో వనం.రాములు,పెద్దింటి.వెంకటేష్,మధు,వడ్డే.రమేష్,గోవిందు నాయుడు తదితరులు ఉన్నారు.

# బిజేపి ప్రభుత్వం చేస్తున్న ఓట్ చోరిపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం.





## ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య

తొలి సమయం, ఇల్లందుఅక్టోబర్, 09.
అఖిల భారత కాంగ్రెస్ కమిటి,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి పిలుపులో భాగంగా ఓటు చోరి పై ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు దొడ్డా డానియల్అధ్యక్షతన, ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిధిగా హాజరైనారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.కేంద్రంలో బిజెపి పార్టీ మూడు రకాలుగా ప్రజలను మోసం చేస్తూ అధికారం చలాయిస్తుందని రాహుల్ గాంధీ గారు ఈ విషయాన్ని పక్క ప్రణాళికతో సాక్షాలతో బహిర్గతం చేశారని ఆనాటి నుండి బిజెపి పెద్దల వెన్నులో వణుకు పుడుతుందని ఈ ఓట్ చోరి విషయం దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలనే దాని కోసం పార్టీ పిలుపు మేరకు ఈ సమావేశం నిర్వహించడం జరిగింది అని ఈ ఓట్ చోరి సామాన్య వ్యక్తి కూడా తెలిసేల కార్యకర్తలు పని చేయాలని జరిగిన ఓటుచోరికి మద్దతునిస్తూ ప్రతి బూతు నుండి 100 మందితో సంతకాలు సేకరించాలని కేంద్రంలో ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తూ అధికారం చాలా ఇస్తున్న అధికార బిజెపి పార్టీ గద్దె దించే వరకు రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి చేసే వరకు కార్యకర్తలందరూ కార్యదర్శులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు,ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు ఇల్లందు మాజీ మున్సిపాలిటీ చైర్మన్ ఎదలపల్లి అనసూయ ఇల్లెందు సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ నాయకులు పూనెం సురేందర్,మాడుగుల సాంబమూర్తి,కాకటి భార్గవ,మాజీ సర్పంచి కల్తీ పద్మ,టౌన్,మండల ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## చేగువేరా స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి- సిపిఐ



తొలి సమయం, వనపర్తిఅక్టోబర్ , 09.ప్రపంచ విప్లవ యోధుడు సోషలిస్టు సమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన చేగువేరా స్ఫూర్తితో సిపిఐ నేతలు కార్యకర్తలు ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీస్ లో చేగువేరా 58వ వర్ధంతి సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ.. డాక్టర్ గా మంత్రిగా విప్లవకారుడిగా ఆయన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రజా పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయిన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం సాధించారని, ఆయన సోషలిస్టు సమాజ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు.చేగువేరాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఇప్పటికీ ఉన్నారంటే ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటం చేసిన త్యాగాలే కారణమన్నారు. ఆస్ఫూర్తితో అందరం పని చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాథం, జిల్లా నేతలు జ్యోతి రూప సుప్రియ సిపిఐ నేతలు అంజి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి దంతాలపల్లి మండలానికి చెందిన విద్య,సామాజికవేత్త సేన్ రాజేష్





తొలి సమయం దంతాలపల్లి అక్టోబర్ 9: దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన విద్యావేత్త సామాజిక వేత్త సేను రాజేష్ దంతాలపల్లి మండల నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి డి ఎస్ రెడ్యా నాయక్ కండువా కప్పి టిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు,అనంతరం రెడ్యా నాయక్ మాట్లాడుతూ సేన్ రాజేష్ బిఆర్ఎస్ పార్టీలోకి రావడం పార్టీకి మరింత బలం చేకూరిందని తెలిపారు, ముఖ్యంగా రాజేష్ , యువకులు ఉత్సాహవంతులు పేద ప్రజలకు అందుబాటులో ఉంటు వారి యొక్క సేవల అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు, రాజేష్ తో పాటు వివిధ పార్టీల నుండి 100 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు,

ఈ సందర్భంగా సేన్ రాజేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నావంతు క్రుషి తప్పకుండా ఉంటుంది అని తెలిపారు ,

పార్టీలో సభ్యత్వానికి సహకరించిన దంతాలపల్లి మాజీ సర్పంచ్ నాయిని శ్రీనివాస్ రెడ్డి కి మాజీ ఎంపీటీసీ కిషోర్ కి మరియు బిఆర్ఎస్ నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగేష్, శ్రావణ్, చంద్రశేఖర్, కిషన్ నాయక్,అంజయ్య, అనిల్, వెంకన్న, సోమేశ్వర్ , ఉప్పలయ్య, నరసయ్య, యాకయ్య, వీర వెంకులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ని కలిసిన ఎమ్మెల్యే, జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇంచార్జ్.



తొలి సమయం, ఇల్లందుఅక్టోబర్, 09.తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత నీ కలిసిన ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్పొరేషన్ ఇంచార్జ్. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్చార్జిగా కొత్తగా ఎంపికైన పొద్దుటూరు నాగేశ్వరరావు బుధవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆర్యవైశ్యుల ను రాజకీయంగా ఎదిగే విధంగా అందరూ కృషి చేయాలని చైర్మన్ సుజాత ఎమ్మెల్యే కు తెలిపారు. కొత్తగా ఇన్చార్జిగా ఎంపికైన నాగేశ్వరరావు కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను పూల్ బొకేతో సత్కరించారు.వారితోపాటు మై లవరపూ బసవయ్య, గుండా సోమేశ్ గుప్తా, గ్రంధి ప్రవీణ్, జి వి వి రవి ఉన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గిరిజన ప్రాంతాలలో గిరిజన రిజర్వేషన్లు అమలు చేయాలి



### స్థానిక ఎన్నికలకు సిపిఎం సిద్ధం - సిపిఎం.

తొలి సమయం, ఇల్లందు అక్టోబర్, 09. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికలకు సిపిఎం పార్టీ సిద్ధంగా ఉందని పార్టీ ప్రభల్యాన్ని విస్తరించడానికి మెజార్టీ స్థానాల్లో సిపిఎం పార్టీ పోటీ చేయనుందని అదేవిధంగా గిరిజన ప్రాంతాలలో మెజార్టీ స్థానాలను గిరిజనులకే కేటాయించాలని గిరిజన చట్టాలను రిజర్వేషన్లను పక్కనపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో రిజర్వేషన్లు ఇతరులకు ప్రశ్నించడన్ని పునరాలోచించాలని సిపిఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ కోరారు.

సిపిఎం ఇల్లందు మండల కమిటీ సమావేశం ఏలూరు లక్ష్మీనారాయణ భవన్ నందు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం క్లారిటీ ఇవ్వనందునే ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిపిఎం పార్టీ సిద్ధంగా ఉంటుందని ఇల్లందు మండలంలో మెజార్టీ ఎంపిటిసి స్థానాలు పార్టీ పోటీ చేయనుందని ఎన్నికల్లో పరిస్థితులకు అనుగుణంగా లౌకికవాద పార్టీలను కలుపుకొని పోతామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛమైన నీతి నిజాయితీ కలిగినటువంటి వ్యక్తులను గెలిపించాలని వారు కోరారు. గిరిజన ప్రాంతాలలో పిసా చట్టం అమలులో ఉన్నందున దానికి అనుగుణంగా రిజర్వేషన్లకు కేటాయించాలని ఆ విధంగా కేటాయించకపోవడం వల్ల గిరిజలకు అన్యాయం జరుగుతుందని ఈ రిజర్వేషన్ల పైన కూడా ఎన్నికల అధికారులు పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మండల నాయకులు మన్నెం మోహన్ రావు, సుల్తానా, మాదారపు వెంకటేశ్వర్లు,ఎం. లక్ష్మి, సంధ్య, వెంకటమ్మ, మరియా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ లోకి చేరిన నిదానాపురం మాజీ సర్పంచ్ పెండ్యాల నరేష్

తొలిసమయం దంతాలపల్లి అక్టోబర్ 9: దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెండ్యాల నరేష్, యూత్ అధ్యక్షుడు యాసాని ప్రశాంత్, వెంకన్న ,నర్సయ్యలు ,కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి డిఎస్ రెడ్డి నాయక్ సమక్షంలో చేరినారు, ఈ సందర్భంగా పార్టీలో సభ్యత్వం తీసుకున్న మాజీ సర్పంచి పెండ్యాల నరేష్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ బలోపేతం కావడానికి నాతోపాటు నా తోటి మిత్రుల కృషి ఉంటుందని తెలిపారు, పార్టీలో సభ్యత్వం పొందడానికి సహకరించిన మండల మరియు గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపినారు, ఇట్టి కార్యక్రమంలో నూకల వెంకటేశ్వర రెడ్డి,నూకల శ్రీనివాస్ రెడ్డి,నూకల గౌతం రెడ్డి,ఓలాద్రి మల్లారెడ్డి, ధర్మవరపు వేణు, వీరాబోయిన కిషోర్,సంజీవరావు,వెంకన్న,సోమేశ్,రాము, తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా కాన్షీరాం 19వ వర్ధంతి వేడుకలు



### కాన్సీరామ్ స్ఫూర్తితో బహుజన రాజ్యం తెస్తాం

తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 7:కాన్సీరాం 19వ వర్ధంతి సందర్భంగా బి.ఎస్.పి రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ కాన్షీరామ్ స్ఫూర్తి తో బహుజన రాజ్యం తెస్తాంఅని అన్నారు. కాన్షీరామ్ 19వ వర్ధంతి సందర్భంగా బి ఎస్ పి జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహన్ మాయావతి ఆదేశాల మేరకు బి ఏ ఎం సి ఈ ఎఫ్,డి ఎస్4,బి ఎస్ పి వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ 19వ వర్ధంతి సభ మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని డా, అంబెడ్కర్ కమ్యూనిటీ హాల్ లో జిల్లా అద్యక్షులు ఇసంపెల్లి ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించినారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని దార్ల శివరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ తర్వాత బి.ఎస్.పినీ దేశం లో జాతీయ పార్టీగ తీర్చి దిద్దిన ఘనత కాన్షీరామ్దేనని ఆయన అన్నారు. విశిష్ట అతిధులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జీలు ఎల్ ,విజయ్ కాంత్, దార ప్రసాద్ రావు మాట్లాడుతూ, రాజ్యాంగం ను కాపాడే శక్తి ఒక బీఎస్పీ కే ఉందని దానిని కొన్ని శక్తులు రద్దు చేసే కుట్ర చేస్తున్నారని వారు అన్నారు. ముందుగా మహాత్మా పూలే డాక్టర్ అంబెడ్కర్ మాన్యవార్ కాన్షీరామ్ చిత్ర పటాలకు పూలమాలలతో నివాళులు అర్పించినారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తగరం నాగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీను, మహబూబాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు గుగులోత్ నరేష్ నాయక్, డోర్నకల్ అసెంబ్లీ అద్యక్షులు బోట్ల ప్రవీణ్ ,కె అరుణ్, జి. హేమంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో మొదటి విడతలో 9 జెడ్పీటీసీ, 104 ఎంపీటీసీ స్థానాలకు జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు.

తొలి సమయం, మహబూబాబాద్ అక్టోబర్ 9:బయ్యారం , చిన్న గూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మహబూబాబాద్, నరసింహులపేట, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో జెడ్పీటీసీ,ఎంపీటీసీ, స్థానాలకు (554) పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు జరుగనున్నాయి అని అధికారిక ప్రకటన ఉదయం పదిన్నరకు నోటిఫికేషన్ విడుదల కాగా నేటి నుంచి ఈ నెల అక్టోబర్ 11 వరకు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందిఅక్టోబర్ 12న పరిశీలన, 15వరకు ఉపసంహరణలు ఉంటాయిఅక్టోబర్ 23న మొదటి దఫా ఎన్నికలు, నవంబర్ 11న పాలితాలు వెలువడనున్నాయి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుని సిద్ధంగా ఉన్నది

# ఎన్ ఎస్ డి సి, ఐటీసీ సంస్థల సౌజన్యంతో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ట్రైనింగ్, భోజనం & వసతి సౌకర్యం

తొలి సమయం, డెస్క్ హైదరాబాద్ అక్టోబర్ 9:
ప్రభుత్వ ఉద్యోగం.. ప్రతి ఒక్క విద్యార్థి కల.. తన కలను సాకారం చేసుకునేందుకు కొంతమంది చదువుకుంటూనే పోటీ పరీక్షలు సన్నద్ధమవుతూ ఉంటారు. మరికొందరు అకడమిక్స్ మీద దృష్టి సారించి.. చదువు పూర్తైన తర్వాత పోటీ పరీక్షల మీద దృష్టి పెడుతుంటారు.ప్రభుత్వ కొలువులు మాత్రమే కాదు ఇటీవలి కాలంలో ప్రైవేట్ ఉద్యోగాలు కూడా యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. ఐటీ ఉద్యోగాలతో పోలిస్తే జీతాల విషయం ఎలా ఉన్నప్పటికీ.. ఉద్యోగ భద్రత ఉంటుందనే కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలకే మొగ్గుచూపడం జరుగుతుంది. అయితే నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం అంత సులువు కాదు. ఎంతో మంది పోటీని తట్టుకుని విజయం సాధించాలంటే సరైన శిక్షణ, సన్నద్ధత అవసరం. అయితే పేదరికం కారణంగా కొంతమంది యువత ఈ డబ్బులు లతో కూడిన శిక్షణ తీసుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నిరుద్యోగ యువతకు శుభవార్త వినిపించింది.



ఉమ్మడి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఎన్ ఎస్ డి సి, ఐటీసీ సంస్థల సౌజన్యంతో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ట్రైనింగ్, భోజనం, వసతి సౌకర్యం, ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సామాజికవర్గాలకు చెందిన యువతీ యువకులకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం ఆసక్తి కలిగిన యువత దరఖాస్తులు చేసుకోవాలని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భూక్యా స్రవంతి తెలిపారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా శిక్షణ అందిస్తారు. అభ్యర్థులు అక్టోబర్ 15వ తేదీలోపు జిల్లా కో–ఆర్డినేటర్ భూక్యా స్రవంతి ని సంప్రదించాలి అని అన్నారు.ఎంపికైన వారికి తెలంగాణ అన్ని జిల్లాలో ఉచితంగా శిక్షణ తో పాటుగా వారికి వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కో – ఆర్డినేటర్ స్రవంతి వెల్లడించారు. ఇంకా ఏవైనా వివరాల కావాలనుకుంటే 9063484855 ఫోన్ నంబర్ సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా కాన్షిరాం వర్ధంతి




౹ొలిసమయం, కొత్తగూడెం, అక్టోబర్ 09 : బహుజన్ సమాజ్ పార్టీ స్థాపకుడు కాన్షిరాం 19వ వర్ధంతిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి యాదగిరి పాల్గొని మాట్లాడుతూ దేశంలో బహుజన విప్లవానికి నాంది పలికిన నేత కాన్షిరాం అని, సామాజిక న్యాయం, సమానత్వం, రాజకీయ అధికారాన్ని బహుజనుల చేతుల్లోకి తీసుకురావడానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.

రాబోయే స్థానిక ఎన్నికల్లో జెడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్ధులను భారీ మెజారిటీతో గెలిపించి బహుజనుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జి కురిమెల్ల శంకర్, జిల్లా కార్యదర్శి భూక్య ముత్యాలు, పాక వెంకటేశ్వర్లు, ప్రవీణ్, ఎనగంటి సంపత్, జిల్లా కార్యవర్గ సభ్యులు, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దిన పత్రిక
తొలి సమయం
శుక్రవారం 10 అక్టోబర్2025

# బీపీ ఉన్నట్టు ఎలా తెలుస్తుంది..?





ఆరోగ్యవంతులకు రక్తపోటు 120/80కి మించి ఉండరాదు. కానీ, నేడు మధ్య వయసు దాటిన చాలా మందిలో బీపీ ఈ లెవల్స్ కు పైనే ఉంటోంది. అది కొంత కాలానికి హైపర్ టెన్షన్ గా మారుతోంది. జీవన విధానం మారిపోయింది. ఉద్యోగం, ఇంట్లోనూ రకరకాల ఒత్తిళ్ల కారణంగా బీపీ నియంత్రణ దాటుతోంది. రక్తపోటు నియంత్రణలో ఉంచుకోకపోతే ధమనులను దెబ్బతీస్తుంది. శరీరంలోని కీలక అవయవాలపై ప్రభావం చూపెడుతుంది. అందుకే వైద్యుడి సూచనల మేరకు బీపీ నియంత్రణలో ఉంచుకోవడానికి మందులు వాడాల్సి ఉంటుంది. బీపీ ఎంతుంటుందో క్రమం తప్పకుండా పరీక్షించుకోవాల్సి ఉంటుంది.

**ఏందుకు ఈ రక్తపోటు...?**

గుండె నుంచి రక్తాన్ని ధమనులు శరీరంలోని అన్ని భాగాలకు తీసుకెళతాయి. గుండె రక్తాన్ని చాలా ఒత్తిడితో పంప్ చేస్తుంది. దాంతో అది వేగంగా ధమనుల ద్వారా ప్రయాణం చేస్తుంది. ఈ ఒత్తిడినే రక్తపోటు అంటారు. బ్లడ్ ప్రజర్ అందరిలోనూ ఉంటుంది. 120/80కు తక్కువగా ఉన్నంత వరకూ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు రావు. కానీ ఈ ఒత్తిడి పెరిగిపోతేనే ఎన్నో రకాల సమస్యలు మొదలవుతాయి. 120/80కు మించి 140/90 లోపు ఉంటే దాన్ని ప్రీ హైపర్ టెన్షన్ గా చెబుతారు. అదే 140/90 అంతకంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 1 హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) గా చెబుతారు. 160/100 కంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 2 హైపర్ టెన్షన్ గా, అంతకంటే అధికంగా ఉంటే తీవ్ర సమస్యగా పరిగణించాలి. 60 ఏళ్లు దాటిన వారికి 150/90 ఉంటేనే హైపర్ టెన్షన్ ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. అదే విధంగా ఈ రక్తపోటు 85/55 వరకు తగ్గినా ఇతరత్రా ఎలాంటి లక్షణాలు లేకుంటే కంగారు పడక్కర్లేదు. తక్కువగా ఉండి కళ్లు తిరుగుతున్నా, తల తిరుగుతున్నా, మూర్ఛిల్లుతున్నా, ఏకాగ్రత లేకపోయినా, కళ్లు బైర్లు కమ్ముతున్నా, వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లాలి. హైపర్ టెన్షన్ ఉన్న సమయంలో తలపోటు, తల వెనుక మెడపై భాగంలో బాగా లాగినట్టు ఉండడం, చిరాకు, కోపం తదితర లక్షణాలు కొందరిలో కనిపించవచ్చు. కొంత మందిలో పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు.

**హైపర్ టెన్షన్ ఉంటే వైద్యుడి చెకప్ అవసరం**

హైపర్ టెన్షన్ ఉన్నవారు ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్ ను సంప్రదించాలి. అప్పుడు మీ వైద్య చరిత్ర, ఏవైనా గుండె జబ్బులు ఉన్నాయా, పొగ తాగే అలవాటు ఉందా తదితర సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కొలెస్టరాల్, డయాబెటిస్ ఉందేమోనన్న అనుమానంతో రక్త పరీక్షలకు సిఫారసు చేస్తారు. దీనికితోడు వైద్యులు స్టెతస్కోప్ తో హృదయ స్పందనలను పరిశీలిస్తారు. వేగంగా కొట్టుకుంటుంటే ధమనుల పరిస్థితిని తెలుసుకునేందుకు ఈసీజీ, ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలను సూచించవచ్చు. దీంతో ముందస్తుగా గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చు.



**ఇంట్లో బీపీ మానిటర్ ఉంటే సేఫ్**

ప్రీ హైపర్ టెన్షన్ లేదా హైపర్ టెన్షన్ సమస్య ఉంటేనే బీపీ మానిటర్ అవసరం అన్న భావన ఉంటే దాన్ని చెరిపేయండి. ఇంట్లో బీపీ మానిటర్ ఉంటే రక్తపోటు నియంత్రణ తప్పకుండా ముందుగానే కట్టడి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. 25 ఏళ్ల వయసు దాటిన వారందరూ నెలకోసారి అయినా బీపీ చూసుకోవడం ద్వారా అది నియంత్రణలో ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది. ప్రారంభంలోనే డాక్టర్ ను సంప్రదించి సూచనల మేరకు జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్ గా మారకుండా జాగ్రత్త పడవచ్చు. సిస్టోలిక్ ప్రజర్ 180 నుంచి 200 పాయింట్లు దాటితే వారి శరీర ధర్మాన్ని బట్టి పక్షవాతం బారిన పడే ప్రమాదానికి చేరువ అవుతున్నట్టు గుర్తించాలి. శరీరంలో తీవ్ర సమస్య ఉందని తెలుసుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నవారు ఉదయం వేళ బీపీ మానిటర్ తో రోజుకు ఒక్కసారి అయినా చెక్ చేసుకోవడం ద్వారా ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. స్ట్రోక్ కు గురయ్యే ప్రమాదం ఉన్నవారికి ఉదయం బీపీ ఎక్కువగా ఉంటుందట. వీలుంటే హైపర్ టెన్షన్ బాధితులు ఉదయం, సాయంత్రం కూడా పరీక్షించుకోవడం క్షేమదాయకం.

**బీపీ మానిటర్లలో రకాలు...**

డిజిటల్, మాన్యువల్ అని రెండు రకాల బీపీ పరీక్షా యంత్రాలు అందు బాటులో ఉన్నాయి. మాన్యువల్ అయితే అందులో పాదరసంతో కూడిన స్కేల్ కు ఓ ఎయిర్ బ్యాగ్ (కఫ్) ను పైపు ద్వారా అనుసంధానించి దాన్ని చేతి భుజం కింద కట్టుకోవాలి. 180 పాయింట్ల వరకు గాలి పంప్ చేసి నిదానంగా విడిచిపెట్టాలి. ఆ తర్వాత చేయి మడత భాగంలో కఫ్ కింద స్టేతస్కోప్ ను ఉంచడం ద్వారా బీపీ ఎంతుందో తెలుసుకోవచ్చు. అదే డిజిటల్ అయితే, ఇంత శ్రమ ఉండదు. చేతి పై భాగంలో కఫ్ కట్టేసి బటన్ నొక్కేస్తే చాలు. దానంతట అదే పౌచ్ లోకి గాలిని పంపిస్తుంది. వెంటనే బీపీ ఎంతుందో మానిటర్ లో అంకెల రూపంలో కనిపిస్తుంది. డిజిటల్ లో కూడా మూడు రకాలు ఉన్నాయి. అప్పర్ ఆర్మ్, రిస్ట్, ఫింగర్ బీపీ మానిటర్లు. అప్పర్ ఆర్మ్ అంటే భుజం కింద చేతికి పై భాగంలో కట్టుకునేది. రిస్ట్ కు కట్టుకుని పరీక్షించుకునే దానిని రిస్ట్ మానిటర్ గా పేర్కొంటారు. వేలుకి కట్టుకునే మానిటర్ ఫింగర్ మానిటర్.

**వైర్ లెస్**

వైర్ లెస్ గా పనిచేసేవి కూడా ఉన్నాయి. కఫ్ ను చేతికి కట్టుకోవాలి. బ్లూటూత్ ద్వారా యాండ్రాయిడ్ లేదా ఐఫోన్ లో బీపీ ఎంతుందో చూసుకోవచ్చు. క్వార్డియో, ఐ హెల్త్ తదితర బ్రాండ్లు ఈ రకం మానిటర్లను విక్రయిస్తున్నాయి. ఇందులో ఐ హెల్త్ మానిటర్ ధర ఫ్లిప్ కార్ట్ లో రూ. 5వేలు.

**ఫలితాల్లో కచ్చితత్వం**

వైద్యులు నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన బీపీ మానిటర్లను ఉపయోగిస్తుంటారు. మరి ఇంట్లో పరీక్షించుకోవడానికి సౌకర్యంతో పాటు ఫలితాల కచ్చితత్వం కూడా అవసరం. డిజిటల్ లో రిస్ట్ మానిటర్లు కంటే హృదయానికి దగ్గరగా చేతికి కట్టే అప్పర్ ఆర్మ్ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం ఎక్కువ. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా అప్పర్ ఆర్మ్ డిజిటల్ మానిటర్లను మాత్రమే సిఫారసు చేస్తోంది. రిస్ట్, వేలికి ధరించే బీపీ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం తక్కువ కనుక వాటిని సూచించలేదు. ఇక సంప్రదాయ బీపీ మానిటర్ లోనూ ఫలితాలు కచ్చితంగానే ఉంటాయి. డిజిటల్ బీపీ మానిటర్లలో బీపీ ఎక్కువగా ఉంటే రెడ్ కలర్, సాధారణంగా ఉంటే గ్రీన్ కలర్ లో ఫలితాలు కనిపించే సౌకర్యం ఉంది. హైపర్ టెన్షన్ రేంజ్ లో ఉంటే హెచ్చరించే మెషిన్లు కూడా ఉన్నాయి. గతంలో చూసుకున్న రీడింగ్స్ ను భద్రపరిచే సౌలభ్యం కూడా అన్నింటిలో ఉంటోంది. సుమారు 100 నుంచి 200 వరకు రీడింగ్స్ స్టోర్ అయి ఉంటాయి. వైద్యుడు దగ్గరకు వెళ్లినప్పుడు చూపించేందుకు ఈ డేటా ఉపయోగకరంగా ఉంటుంది.

**కఫ్ సైజు**

కఫ్ సైజు చేతికి సరిపోయే విధంగా ఉండాలి. అలాగే సరిగా ధరించాలి. అప్పుడే కచ్చితమైన రీడింగ్ వస్తుంది. పిల్లలకు, పెద్దలకు ఒకే సైజు కఫ్ సరిపోదు. అందుకే వాడే కఫ్ సరిపోకపోతే పెద్దల కోసం మరొకటి కొనుగోలు చేసుకుంటే సరి. కఫ్ లలో స్మాల్, మీడియం, లార్జ్ సైజులు ఉంటాయి. స్మాల్ అంటే 7.1నుంచి 8.7 అంగుళాల మేర కఫ్ పొడవు ఉంటుంది. మీడియంలో 8.8 నుంచి 12,8 అంగుళాలు, లార్జ్ లో 12.8 నుంచి 18 అంగుళాల మేర ఉంటుంది. ఎక్కువ శాతం బీపీ మానిటర్లు మీడియం సైజు కఫ్ తో విక్రయానికి వస్తుంటాయి.

**అడాప్టర్లు ఉన్నవి అయితే బెటర్**

డిజిటల్ మానిటర్లు బ్యాటరీల సాయంతో పనిచేస్తాయి. బ్యాటరీలతోపాటు అడాప్టర్లతో పనిచేసేవి కూడా ఉన్నాయి. అడాప్టర్ అయితే నేరుగా కరెంట్ ప్లగ్ పిన్ కు అనుసంధానించుకుని పరీక్షించుకోవచ్చు.

**సైలంట్ కిల్లర్. రక్తపోటు (బ్లడ్ ప్రజర్/బీపీ)కి మరోపేరు. బీపీని నియంత్రణలో ఉంచుకోకపోతే అది ఎన్నో సమస్యలకు కారణమవుతుంది. హార్ట్ ఎటాక్, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. మరి బీపీ నియంత్రణలో ఉందా? లేదా? అన్నది ఎలా తెలుస్తుంది...? బీపీ మానిటర్ ద్వారా క్రమం తప్పకుండా పరీక్షించుకుంటే సరి. అందుకోసం ఆస్పత్రి చుట్టూ తిరగడం కంటే ఓ మంచి బీపీ మానిటర్ ను ఇంట్లో ఉంచుకోవడం ఉపయోగకరం. మరి కొనే ముందు పరిశీలించాల్సిన విషయాలు ఉన్నాయి. అలాగే, బీపీ గురించి చాలా విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.**

---

**గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు (ప్రోటీన్), అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. గుడ్డు తింటే బరువు పెరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. దీనికి కారణం పచ్చసొనలోని కొలెస్ట్రాలే.**

## గుడ్డెందుకు తినాలి?



అయితే గుడ్డులో కొలెస్ట్రాల్ స్థాయులు ఎక్కువగా ఉన్నప్పటికీ.. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు అంత ఎక్కువగా ఏమీ పెరగటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కేలరీలు తక్కువ. పైగా చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఫలితంగా త్వరగా ఆకలి వేయదు. ఇలా ఇది పరోక్షంగా బరువు తగ్గటానికీ తోడ్పడుతుందన్నమాట.

కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించటంతో పాటు శరీరంలో జరిగే పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు గుడ్డుతో లభిస్తాయి.

దీని పచ్చసొనలోని ఐరన్ మన శరీరం తేలికగా గ్రహించటానికి అనువుగానూ ఉంటుంది.

గుడ్డులోని ల్యూటీన్ అనే యాంటీ ఆక్సిడెంటు కంటి జబ్బుల ముప్పు తగ్గటానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ ఇది దోహదం చేస్తుంది.

రోజుకు ఒక గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం వరకు తగ్గుతున్నట్టు ఒక పరిశోధనలో వెల్లడైంది.


## పొటాషియం తగ్గితే..



ఖనిజ లవణాల్లో ఒకటైన పొటాషియం మనకు ఎంతగానో తోడ్పడుతుంది. నాడులను, కండరాలను నియంత్రించటం దగ్గర్నుంచి.. ఆహారం జీర్ణం కావటం వరకూ ఎన్నో పనుల్లో పాలు పంచుకుంటుంది. అందుకే పొటాషియం లోపిస్తే కండరాలు పట్టేయటం, గుండె కొట్టుకునే వేగం మారిపోవటం, చర్మం పొడిబారటం, మొటిమలు, అజీర్ణం వంటి సమస్యలెన్నో ముంచుకొస్తాయి. పొట్టుతీయని ధాన్యాలు, మాంసం, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయల్లో పొటాషియం దండిగా ఉంటుంది. ముఖ్యంగా అరటిపండు, చిలగడదుంపలతో పుష్కలంగా లభిస్తుంది. అందుకే పండ్లు, కూరగాయలు అంతగా తినకుండా చిప్స్ వంటి చిరుతిళ్లు ఎక్కువగా తినేవారిలో దీని లోపం ఎక్కువగా చూస్తుంటాం.

---

## బ్యాక్టీరియా 'ఆయుష్షు'!



మన ఆరోగ్యం విషయంలో పేగుల్లోని బ్యాక్టీరియా చాలా కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్ట పిండి పదార్థాలను జీర్ణం చేయటం దగ్గర్నుంచి రోగనిరోధకవ్యవస్థకు తర్ఫీదు ఇవ్వటం వరకూ ఎన్నెన్నో పనులు నిర్వర్తిస్తుంది. అంతేనా? ఇది ఆయుష్షు పెరగటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. వృద్ధుల ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికీ పేగుల్లోని బ్యాక్టీరియాకూ గణనీయమైన సంబంధం కనబడుతుండటమే దీనికి నిదర్శనం. మంచి ఆరోగ్యంగా ఉన్న 90 ఏళ్ల వృద్ధుల్లో కూడా యువ ఆరోగ్యవంతుల పేగుల్లో మాదిరిగానే బ్యాక్టీరియా రకాలు కనబడుతున్నట్టు తేలింది మరి. వృద్ధుల ఆరోగ్యానికి బ్యాక్టీరియా దోహదం చేస్తోందా? ఆరోగ్యవంతుల పేగుల్లో మంచి బ్యాక్టీరియా ఉంటోందా? అనేది స్పష్టంగా తెలియనప్పటికీ.. ఈ రెండింటికీ లంకె ఉండటం మాత్రం నిజమని పరిశోధకులు పేర్కొంటున్నారు. అంటే రక్తనాళాల ఆరోగ్యానికి కొలెస్ట్రాల్ మాదిరిగానే వృద్ధుల ఆరోగ్యానికీ పేగుల బ్యాక్టీరియాను జీవసూచికగా భావించవచ్చన్నమాట. అందువల్ల పెరుగు, పులియబెట్టిన పదార్థాల వంటి ప్రొబయోటిక్స్ తీసుకోవటం మంచిది. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. ప్రొబయోటిక్స్ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి, కొన్నిరకాల క్యాన్సర్ల బారినపడకుండా చూస్తాయి. అందువల్ల ఇవి ఆరోగ్యంగా ఉండటానికి, ఆయుష్షు పెరగటానికి దోహదం చేసే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

## ముందస్తు నెలసరికి పాల రక్ష!



కొందరికి కాస్త త్వరగా నెలసరి నిలిచిపోతుంటుంది (మెనోపాజ్). దీంతో ఎముకలు గుల్లబారటం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు మరింత పెరుగుతుంది. అయితే క్యాల్షియం, విటమిన్ డి ఎక్కువగా తీసుకోవటం ద్వారా ఇలా త్వరగా మెనోపాజ్ ముంచుకొచ్చే ముప్పును తగ్గించుకోవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గుర్తించాల్సిన విషయం ఏంటంటే- మాత్రల కన్నా క్యాల్షియం, విటమిన్ డి దండిగా గల ఆహారం తీసుకోవటం మూలంగానే ఈ ఫలితం కనబడుతుండటం. ముఖ్యంగా పాలు, పెరుగు వంటి పాల ఉత్పత్తులతో ఇంకాస్త ఎక్కువ ప్రయోజనం చేకూరటం. పాలు, పెరుగు, మజ్జిగ వంటి వాటితో లభించే విటమిన్లు, కొవ్వులు, హార్మోన్లు (ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్ వంటివి) మాత్రల్లో ఉండకపోవటమే దీనికి కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.

దిన పత్రిక
తొలి సమయం
శుక్రవారం 10 అక్టోబర్ 2025

# ది బెస్ట్ హెరిటేజ్ సిటీ.. బుడాపెస్ట్

స్విట్జర్లాండ్ రాజధాని జ్యూరిక్ నుంచి బుడాపెస్ట్ వరకు రైలు మార్గంలో సాగిన మా ప్రయాణం.. దారిపొడవునా మంచుదుప్పటి కప్పుకొన్న యూరప్ పట్టణాలను, పల్లెలనూ దాటుకుంటూ హంగరీ రాజధానికి చేరుకుంది. ఆ వారసత్వ నగరంలో.. అడుగడుగునా అద్భుతాలే! యూరప్ మొత్తంలో అత్యంత సాంస్కృతిక వైవిధ్యం, గొప్ప చరిత్ర కలిగిన నగరం హంగరీ రాజధాని బుడాపెస్ట్. యూరప్ ఖండం నడిమధ్యన ఉన్న బుడాపెస్ట్ నిజానికి 1873లో మూడు నగరాలు (బుడా, ఓబుడా, పెస్ట్) కలిస్తే ఏర్పడింది. బుడా ఓ కొండమీద ఉంటుంది. డాన్యూబ్ నదికి ఆవల ఉన్న పెస్ట్, ఓబుడా కొంతమేర మైదాన ప్రాంతాలు. గడచిన శతాబ్దకాలంలో రెండు ప్రపంచ యుద్ధాలలో తీవ్రంగా నష్టపోయిన హంగరీ అటు నాజీయిజం నుంచి ఇటు కమ్యూనిజం మీదుగా క్యాపిటలిజం వరకూ అన్ని ఇజాలనూ చవిచూసింది. భిన్నధ్రువాల మధ్య నలిగిపోతూ కష్టనష్టాలకు లోనైంది. మేము బుడా కొండ మీదున్న హిల్టన్ హొటల్‌లో దిగాం. దాని చుట్టూ అనేక పురాతన వారసత్వ కట్టడాలు ఉన్నాయి. తొలిరోజు ఉదయాన్నే లోకల్ టూర్ కోసం క్యాబ్ బుక్ చేసుకున్నాం.





లోకల్ గైడ్‌గా కూడా ఉపయోగపడే డ్రైవర్ కావాలని ముందే చెప్పాం. మేం వెళ్లే సరికి.. నలుపురంగు టొయోటా కారుతో ఆండ్రూ సిద్ధంగా ఉన్నాడు. ముందుగా, పక్కనే ఉన్న కొన్ని ప్రదేశాలు చూశాం.

**ప్రాచీన చర్చి**

మా హొటల్‌కు అనుకుని మత్థేయస్ చర్చి ఉన్నది. క్రీ.శ 1015లో హంగరీ రాజు సెయింట్ స్టీఫెన్ దీన్ని నిర్మించాడట. అనేక యుద్ధాలు, దాడులలో ధ్వంసమైపోవడంతో, 19వ శతాబ్దం చివరన పునర్నిర్మించారు. పక్కనే ఉన్న మరో చారిత్రక కట్టడం.. ఫిషర్మెన్స్ బాస్టియన్. 1700లలో నిర్మించిన ఒక కోటలోని భాగమే ఈ నిర్మాణం. బుడాపెస్ట్‌కు వెళ్లే ప్రతి టూరిస్ట్ ఈ కట్టడాన్ని తప్పక దర్శించాలి. డాన్యూబ్ నదికి సమాంతరంగా 140 మీటర్ల ప్రాకారం ఉంది. దానికి ఉన్న కిటికీల గుండా నగరం మొత్తం దర్శనమిస్తుంది. అక్కడే చాలాసేపు గడిపి, తదుపరి మజిలీకి బయలుదేరాం.



**వేడినీటి బుగ్గలు**

హంగరీకి సముద్ర తీరం లేకపోవచ్చు. కానీ ఈ దేశానికి విలువైన నీటి సంపద ఉన్నది. దేశమంతా విస్తరించి ఉన్న 1300 వేడి నీటి బుగ్గల్లో (హాట్ స్ప్రింగ్స్) 120 వరకూ ఒక్క బుడాపెస్ట్‌లోనే ఉన్నాయి. ఈ హాట్ స్ప్రింగ్స్‌లో ఔషధ గుణాలున్న ఖనిజాలు కరిగి ఉంటాయి. అందుకే, వందల ఏళ్ల క్రితమే ఇక్కడ అనేక స్నానశాలలు వెలిశాయి. బుడాపెస్ట్‌కు వచ్చే టూరిస్టులు ఆ వెచ్చని నీటిలో సేదతీరుతారు. మా క్యాబ్ డ్రైవర్ మమ్మల్ని 1918లో నిర్మించిన గిల్లెర్ట్ థర్మల్ బాత్‌కు తీసుకువెళ్లాడు. మేం స్నానం చేయలేదు కానీ.. ఆ పరిసరాలు చూసి, ఫొటోలు తీసుకుని వచ్చేశాం.

డాన్యూబ్ నది మీద 1840లలో కట్టిన మొదటి వంతెన చెయిన్ బ్రిడ్జ్. బుడా, పెస్ట్ నగరాలను తొలిసారిగా కలిపిన వారధి ఇదే. ఈ నగరంలో ఎత్తయిన భవంతులేవీ కనపడవు. నగరంలో అత్యంత ఎత్తయిన కట్టడాలు రెండే రెండు. ఒకటి సెయింట్ స్టీఫెన్స్ బాసిలికా, మరొకటి హంగరీ పార్లమెంటు భవనం. రెండూ కూడా 96 మీటర్ల ఎత్తే ఉంటాయి. హంగరీ దేశం క్రీ.శ. 896లో ఉనికిలోకి వచ్చింది. కాబట్టే ఆ రెండు భవంతులూ 96 మీటర్లు ఉంటాయని అంటారు. మేం బుడాపెస్ట్ వెళ్లింది జనవరి నెలలో. కానీ ఈ నగరాన్ని చూడటానికి మంచి సమయం.. మే నెల నుంచి అక్టోబర్ వరకు. మిగతా నెలల్లో వాతావరణం మరీ చల్లగా ఉంటుంది. బుడాపెస్ట్ ప్రజా రవాణా వ్యవస్థ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1866లో మొదలైన ట్రామ్ సర్వీసు నేటికీ విజయవంతంగా నడుస్తున్నది. 1896లో బుడాపెస్ట్‌లో మొదలైన మెట్రో రైలు యూరప్ ఖండంలోనే అత్యంత పురాతనమైనది. ఈ మెట్రోను యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. సిటీ బస్సులకైతే కొదవే లేదు. చార్జీలూ చవకే. బుడాపెస్ట్‌లో మరో ఆకర్షణ రూయిన్ బార్లు. రెండో ప్రపంచ యుద్ధం, తర్వాతి పరిణామాల్లో బుడాపెస్ట్‌లో కొన్ని భవంతులు శిథిలం అయ్యాయి. ఆ పాడుబడ్డ భవనాలనే ప్రత్యేక థీమ్ బార్లుగా మార్చారు. ఇవి ప్రతి రాత్రీ సందర్శకులతో కిక్కిరిసిపోతాయి.

**పాదరక్షలు.. రక్తపు మరకలు**

మర్నాడు ఉదయం క్యాబ్‌లో కూర్చునేసరికి సన్నగా ముసురు మొదలైంది. మూడు అంచెల దుస్తులు ధరించినా చలి వణికిస్తూనే ఉంది. మా డ్రైవర్ చెయిన్ బ్రిడ్జి దాటి డాన్యూబ్ నది అంచున ఉన్న రోడ్డు పక్కన ఆపాడు. రెండు గొడుగులు ఇచ్చి ఇక నడవమన్నాడు. మాకేమో చలికి వేళ్లు వంకర్లు పోతున్నాయి. కొద్ది దూరం నడిచాక.. జనం గుమికూడి ఉన్నచోట ఆగమన్నాడు. అక్కడ నేల మీద చెల్లాచెదురుగా కొన్ని బూట్లు పడున్నాయి. దగ్గరికి పోయిచూస్తే కానీ నిజం బూట్లు కావని తెలియలేదు. అవి ఇనుముతో చేసిన బూట్ల బొమ్మలు. రెండో ప్రపంచ యుద్ధంలో డాన్యూబ్ నది ఒడ్డున ఊచకోతకు గురైన యూదుల స్మారకార్థం.. హంగరీకి చెందిన కాన్ తోగే అనే సినిమా దర్శకుడు గ్యులా పార్ అనే శిల్పి కలిసి సృష్టించిన 'ద షూస్ ఆన్ ద డాన్యూబ్ బ్యాంక్' అది. వందలాది యూదులను ఆ నది ఒడ్డున నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపే ముందు.. ఆ పాదరక్షల్ని ఎవరికైనా అమ్ముకోవచ్చు అనే ఉద్దేశంతో అక్కడ వాటిని విడిపించిందట హంతక ముఠా. ఆ చీకటి రాత్రి నాజీల తూటాలకు నేలకొరిగిన యూదులను తలచుకుంటూ, ఆ బూట్లలో పుష్పాలుంచి భారమైన హృదయంతో




**అక్కడి నుంచి కదిలాం.**

అక్కడికి కూతవేటు దూరంలోనే.. హంగేరియన్ పార్లమెంటు భవనం ఠీవిగా దర్శనమిచ్చింది. 1902లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భవంతి యూరప్ ఖండంలోనే అతి పెద్ద పార్లమెంటు భవనం కూడా. భవంతి ఆవరణలో 88 మంది హంగేరియన్ పాలకులు, రాజులు, మిలిటరీ కమాండర్ల విగ్రహాలు పెట్టారు. అందులో కొన్నిటి పేర్లు చదువుతూ ముందుకు సాగాం. అక్కడినుంచి నగరంలోని ప్రధాన షాపింగ్ ప్రాంతం వాసీ స్ట్రీట్‌కు తీసుకెళ్లాడు మా క్యాబ్ డ్రైవర్. అక్కడే కొంత షాపింగ్ చేసి, మధ్యాహ్న భోజనం కూడా చేశాం.

**హీరోస్ స్కేర్**

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ పక్షాన నిలిచిన హంగేరియన్ పాలకులు సుమారు ఆరు లక్షల యూదులను ఊచకోత కోశారని చెప్పుకొచ్చాడు మా డ్రైవర్. యుద్ధం ముగిశాక రష్యా అధీనంలోకి వెళ్లింది హంగరీ. అప్పుడు, ఇంకోరకం హత్యాకాండ మొదలైంది. స్టాలిన్ నాయకత్వంలోని రష్యా కనుసన్నల్లో నడిచే ప్రభుత్వాలు మరోరెండు లక్షల మంది హంగేరియన్ల ఉసురు తీశాయి. సుమారు నాలుగు దశాబ్దాల కమ్యూనిస్ట్ పాలన తరువాత.. 1980లో జరిగిన తిరుగుబాటు కారణంగా క్యాపిటలిస్ట్ ప్రభుత్వం వచ్చిందని వివరించాడు. ఆరోజు కూడా ఆకాశం మేఘావృతమైంది. అప్పుడప్పుడూ చినుకులు రాలుతున్నాయి. మాటల్లోనే బుడాపెస్ట్ నడిబొడ్డున ఉన్న హీరోస్ స్క్వేర్ చేరుకున్నాం. 1896లో హంగరీ సహస్రాబ్ది సందర్భంగా ఇక్కడే ఓ స్మారక చిహ్నం నిర్మించారు. 1932లో దీనికి హీరోస్ స్క్వేర్‌గా నామకరణం చేశారు. నలుదిక్కులా అందమైన భవంతులతో, స్క్వేర్ మధ్యలో ఒక భారీ స్తూపంతో ఆకట్టుకునేలా ఉందీ ప్రదేశం. బుడాపెస్ట్‌లో చివరి రోజు సాయంత్రం మిత్రులమంతా డాన్యూబ్ నది ఒడ్డున కూర్చున్నాం. ప్రపంచంలోనే అత్యధికంగా.. పది దేశాల గుండా ప్రవహించే మహానదిలో నిర్మలంగా పారుతున్న ఆ నీటికేసి చూస్తే.. ఇజాల మత్తులో పడి మూర? పుమానవులు ఈ నదిలో ఎంత నెత్తురు పారించారో కదా అనిపించింది. మనసు చివుక్కుమంది.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్ తెలుసా !







సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**లక్నవరం సరస్సు..** నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

**శామీర్‌పేట్ లేక్..** హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హొటళు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

**డిండి..** నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

**కొండపోచమ్మ..** నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

**అనంతగిరి..** ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

**కీసరపోదాం..** ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు.. 'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

**రాచకొండ కోట..** నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి–భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి. హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4 గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకూర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చెర వంటివి ఉన్నాయి.

**నల్లమల అడవులు..**నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS H-NO 1-6-155/43/45/4
NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101